సెంట్రింగ్ కార్మికుడి అదృశ్యం

ఎర్రాకుల రాజు

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 13: భవన నిర్మాణంలో సెంట్రింగ్ విధులకు వెళ్లిన కార్మికుడు అదృశ్యమైన ఘటన కేపీహెచ్‌బీ ఠాణా పరిధిలో చోటుచేసుకున్నది. కేపీహెచ్‌బీ పోలీసులు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. జూబ్లీహిల్స్ ఫిల్మ్‌నగర్‌కు చెందిన ఎర్రాకుల రాజు(50)సెంట్రింగ్ పనులు చేస్తున్నాడు. హైదర్‌నగర్ డివిజన్ అడ్డగుట్టలో ఓ భవన నిర్మాణంలో సెంట్రింగ్ పనుల నిమిత్తం రవి బుధవారం ఉదయం వచ్చాడు. తిరిగి సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో పని ప్రాంతంలో ఆయన ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లభించలేదు. దీంతో కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకొని బాలిక ఆత్మహత్య

కుత్బుల్లాపూర్, జూన్ 13:ఉరి వేసుకొని ఓ బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకున్నది.

ఎస్‌ఐ ధర్మేశ్ తెలిపిన వివరాల ప్రకారం... ఏపీ ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం కందులూరు గ్రామానికి చెందిన శివనాగరాజు తన కుటుంబ సభ్యులతో కలిసి గత కొన్నేండ్లుగా నగరానికి వచ్చి దూలపల్లిలో ఉంటూ మేస్త్రీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. తన పెద్ద కూతురు భవ్యశ్రీ (15) సొంతూరులో పదవ తరగతి పూర్తి చేసుకొని గత పదిహేను రోజుల కిందటనే దూలపల్లిలోని తన తల్లిదండ్రులు ఉంటున్న ఇంటికి వచ్చింది. కాగా, గురువారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. మృతికి గల కారణాలు తెలియరాలేదు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

సీఎం సహాయనిధి మంజూరు పత్రాన్ని ఇస్తున్న ఎమ్మెల్యే గాంధీ

■ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్, జూన్ 13: సీఎం సహాయనిధి పేదలకు వరమని, ఈ సాయంతో అనారోగ్య బాధిత పేద ప్రజలు కార్పొరేట్ దవాఖానలో ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చునని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఈ పథకం అన్నార్థులకు అండగా నిలుస్తున్నదన్నారు. గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గానికి చెందిన కాంతారావుకు సీఎం సహాయనిధి పథకం కింద మంజూరైన రూ.1.20 లక్షల ఆర్థిక సాయం నిధుల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే గాంధీ గురువారం ఆయన నివాసంలో అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం సహాయనిధి నిరుపేదలకు ఆరోగ్య భరోసాను ఇస్తున్నదన్నారు. పేదరికంతో ఏ ఒక్కరూ వైద్యానికి దూరంగా ఉండవద్దనే సదుద్దేశంతో ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నదన్నారు. ఆర్థిక స్థోమత లేకున్నా ప్రభుత్వం సీఎం సహాయనిధి కింద అందించే సాయంతో అనారోగ్యాలను నయం చేసుకోవచ్చని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు సకాలంలో సాయం లభించేలా తాను కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ప్రయాణికుల సౌకర్యార్థం కాలనీకి ఆర్టీసీ బస్సు

ప్రయాణికులు, విద్యార్థులు, కాలనీ ప్రజల సౌకర్యం కోసం ఆర్టీసీ బస్సు వసతిని కల్పించినట్లు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తెలిపారు. ఏండ్ల తరబడి కాలనీ వాసులు ఎదురు చూస్తున్న ఈ సౌకర్యాన్ని అధికారులతో సమన్వయం చేసి కల్పించామన్నారు. కూకట్‌పల్లి డివిజన్ అస్బెస్టాస్ కాలనీకి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించిన నేపథ్యంలో కాలనీవాసులు ఎమ్మెల్యే గాంధీని గురువారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. 41సీ ఆర్టీసీ బస్సు అస్బెస్టాస్ కాలనీ నుంచి అఫ్జల్‌గంజ్ వరకు రవాణా సౌకర్యం కల్పిస్తుందని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నానాటికి రవాణా వసతి మెరుగుపడుతుందని, ఉచిత బస్సును మహిళలు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు నరేశ్, నర్సింహులు, మహ్మద్ హుస్సేన్, రఫిక్, పుష్ప, అబుల్ తదదిరులు పాల్గొన్నారు.

ఘనంగా నవదుర్గ వార్షికోత్సవం

జగద్గిరిగుట్ట, జూన్13 : ఆధ్యాత్మిక వేడుకలతో ప్రజలకు శాంతి, ఐకమత్యం చేకూరాలని ప్రజాప్రతినిధులు ఆకాంక్షించారు. జగద్గిరిగుట్ట సీసల బస్తీ నవదుర్గ ఆలయ వార్షికోత్సవానికి గురువారం ఎమ్మెల్యేలు వివేకానంద్, అరికెపూడిగాంధీ హాజరయ్యారు. చండీహోమం, కలశాలతో గండదీపం, అన్నదానం నిర్వహించారు. కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేశ్ రెడ్డి, వెంకటేశ్వర ఆలయ చైర్మన్ వేణు యాదవ్ పూజల్లో పాల్గొన్నారు. నేతలు రుద్ర అశోక్, జైహింద్, హజరత్ అలీ, పాపుల్‌గౌడ్, విఠల్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

■ కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న బాలానగర్ కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి

బాలానగర్, జూన్ 13: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు విద్యనందిస్తున్నాయని బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని బాలానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్‌రెడ్డితో కలిసి రవీందర్‌రెడ్డి విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు ప్రభుత్వ పాఠశాలలు దిక్సూచిగా నిలిచే విధంగా మాజీ సీఎం కేసీఆర్ బాటలు వేశారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. కేసీఆర్ విద్యావ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టినందు వల్లనే ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు కల్పించబడ్డాయని గుర్తు చేశారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పది ఫలితాల్లో సత్తా చాటుతున్నారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు అరుణజ్యోతి, స్థానిక బీఆర్‌ఎస్ నేతలు మహ్మద్ ఖాజా, యెలిజాల యాదగిరి, శ్రీనివాస్, బాజిని నాగేందర్‌గౌడ్, ప్రేంకుమార్, నాగరాజ్, మానేపల్లి రాము, మహ్మద్ సోఫీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సాయి నాగేంద్రాలయంలో పూజలు

బాలానగర్ సాయినగర్‌లోని సాయి నాగేంద్రాలయంలో గురువారం వైభవంగా పూజలు జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ అంబటి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమ అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. – బాలానగర్, జూన్ 13

విపత్తులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

జడ్సీ అభిలాష

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 13 : వర్షాకాలం విపత్తులను ఎదుర్కొనేందుకు అత్యవసర బృందాలు సిద్ధంగా ఉండాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అన్నారు. గురువారం జోన్ ఆఫీస్‌లో పలు విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఆషాడం బోనాల ఉత్సవాల నిర్వహణ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, వర్షాకాలంలో ముంపు సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాలనీలు, బస్తీల్లో ముంపు సమస్యలున్న చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. స్థానికంగా కార్పొరేటర్లు గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సెల్లార్‌ల తవ్వకాలపై నిషేధం విధించడం జరిగిందని, ఎక్కడైనా సెల్లార్ల తవ్వకాన్ని గుర్తిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. దోమల నియంత్రణకు ముందస్తుగా చర్యలు, బక్రీద్ పండుగ సందర్భంగా ఏర్పాట్లు చేయాలన్నారు. పారిశుధ్య విభాగం సిబ్బంది ప్రజలతో సమాశాలు నిర్వహించాలని, ప్రతి ఇంటికి స్వచ్ఛ ఆటోలను పంపించాలన్నారు. తొలగించిన జీవీపీలలో మళ్లీ చెత్తాచెదారం వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. 'ప్రజావాణి'లో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీలు, ఇంజినీరింగ్, పారిశుధ్య, ఎంటమాలజీ, టౌన్‌ప్లానింగ్, ఎలక్ట్రికల్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి జడ్సీ అభిలాష అభినవ్‌తో మాట్లాడుతున్న బండి రమేశ్

ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చూడండి

మియాపూర్, జూన్ 13: నాలాలు మ్యాన్‌హోళ్ల వద్ద ఎటువంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి బండి రమేశ్ జడ్సీని కోరారు. కూకట్‌పల్లి జడ్సీ అభిలాష అభినవ్‌ను గురువారం ఆమె కార్యాలయంలో కలుసుకుని నాలాలు సహ ఇతర పలు అంశాలపై బండి రమేశ్ విన్నవించారు. కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

శ్రీశైలంగౌడ్‌ను కలిసిన ఐఎన్‌టీయూసీ కమిటీ

దుండిగల్, జూన్ 13:కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, డీ.పోచంపల్లిలోని ఆల్కాలిక్ మెటల్స్ కంపెనీ ఎంప్లాయిస్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ)కమిటీ అధ్యక్షుడిగా కౌన్సిలర్ ఎం.రాముగౌడ్, సలహాదారులుగా మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్ రెడ్డి ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం యూనియన్ అధ్యక్షుడు, కౌన్సిలర్ ఎం.రాముగౌడ్ ఆధ్వర్యంలో యూనియన్ సభ్యులు, కంపెనీ ఉద్యోగులు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత, కంపెనీ అడ్వైజర్ కూన శ్రీశైలంగౌడ్‌ను షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు.

అమర్‌నాథ్ యాత్రికులపై ఉగ్రవాదులు చేసిన దాడిని నిరసిస్తూ అల్లాపూర్ డివిజన్ శ్రీవివేకానందనగర్ కాలనీలోని వివేకానంద విగ్రహం వద్ద హిందువాహిన ఆధ్వర్యంలో కొవ్వొత్తులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో హిందువాహిన కన్వీనర్ సీహెచ్.శ్రీనివాస్‌రెడ్డి, కోకన్వీనర్ వంశీకృష్ణ, వెంట్రామ్‌రెడ్డి, సుదర్శన్ ముదిరాజ్, రాజు, వేణు, విజయ్‌కుమార్, అంకిత్, సాయిచంద్, చింటు తదితరులు పాల్గొన్నారు. – అల్లాపూర్, జూన్ 13

నాలా రిటైనింగ్‌వాల్ పనుల్లో నాణ్యత పాటించాలి

ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్

నాలా రిటైనింగ్‌వాల్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సతీశ్‌గౌడ్

బాలానగర్, జూన్ 13:నాలా రిటైనింగ్‌వాల్ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. గురువారం ఫతేనగర్ డివిజన్ పరిధిలోని జింకలవాడలో రూ.90లక్షల నిధులతో చేపట్టిన రిటైనింగ్‌వాల్ నిర్మాణ పనులను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ముంపు సమస్యను దృష్టిలో పెట్టుకొని శాశ్వత పరిష్కారం దిశగా అధికారులు అడుగులు వేయాలని సూచించారు. అదే క్రమంలో ప్రజల నివాసాల వైపునకు ఎక్కువ స్థలం తీసుకోకుండా పరిశ్రమల వైపు స్థల సేకరణ ఎక్కువగా తీసుకొని పనులు పూర్తి చేయాలని, ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలంటే సమగ్రంగా ఆలోచన చేసి ముందుకు సాగాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఈ శ్రీదేవి, ఏఈ పవన్, స్థానికులు రాజు, సుదర్శన్‌రెడ్డి, బాల నర్సింహులు, రాజు, వెంకటేశ్, ఫిరోజ్, సాయికుమార్, లక్ష్మణ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో సమస్యల్లేకుండా చూడాలి

ఎమ్మెల్యేను కలిసిన సంక్షేమ సంఘం ప్రతినిధులు

కుత్బుల్లాపూర్, జూన్13 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ ఎంఎన్‌రెడ్డి నగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు గురువారం స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాలనీలో ఉన్న కమ్యూనిటీహాల్‌కు పై అంతస్తు నిర్మాణం చేపడితే కాలనీలో అందరికి అవసరంగా ఉంటుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందిస్తూ సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో చర్చించి త్వరితగతిన ప్రారంభించేలా తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, బీఆర్‌ఎస్ పార్టీ నేత సంపత్‌గౌడ్, కాలనీ జనరల్ సెక్రటరీ రవీందర్‌గౌడ్, కోశాధికారి కరుణాకర్‌రెడ్డి, సలహాదారులు సత్యరాం, కోక్యా షియర్ బాపిరెడ్డి, ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను కలిసి తమ సమస్యలు తెలుపుతున్న ఎంఎన్ రెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సంపత్‌గౌడ్ తదితరులు

వైద్యం వికటించి మహిళ మృతి

దవాఖాన ఎదుట మృతురాలి కుటుంబసభ్యుల ఆందోళన

ప్రవళిక(ఫైల్)

మూసాపేట, జూన్13: వైద్యం వికటించి ఓ ప్రైవేట్ దవాఖానలో మహిళ మృతి చెందిన ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. మృతురాలి కుటుంబసభ్యులు తెలిపిన ప్రకారం... సనత్‌నగర్‌కు చెందిన ప్రవళిక(29) మార్చి 18న సనత్‌నగర్ నుంచి బీరంగూడకు వెళ్తుండగా అల్సబా హోటల్ వద్ద ప్రమాదానికి గురైంది. వెంటనే 108 సాయంతో స్థానిక అమ్మోర్ దవాఖానకు తరలించారు. వైద్యులు పరీక్షించి తొడ, తొంటి భాగంలో ఫ్యాక్చర్ అయిందని, సర్జరీ చేయాలని రూ.3లక్షలు ఖర్చు అవుతుందని చెప్పి చికిత్స ప్రారంభించారు. రెండు నెలలుగా పలు సర్జరీల పేరిట రూ.16లక్షలు వసూలు చేశారు. బుధవారం ఉదయం నుంచి ప్రవళిక ఆరోగ్యం ఆందోళనకరంగా మారిందని, వైద్యానికి స్పందించడంలేదని, వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నామని వైద్యులు తెలిపారు. కుటుంబసభ్యులకు ప్రవళికను చూపించకపోవడంతో ఆసుపత్రి వర్గాలను బంధువులు నిలదీయగా మృతి చెందినట్లు చెప్పారు. దీంతో మృతురాలి కుటుంబసభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఇరువురితో చర్చలు జరిపి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు.

స్పందించని జిల్లా వైద్యాధికారులు

గత కొన్ని రోజులుగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలో ఉన్న పలు ప్రైవేటు దవాఖానల్లో అమ్మోర్ దవాఖానలో జరిగిన ఘటనలు జరుగుతున్నా జిల్లా వైద్యాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని బాధిత కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. చిన్నపాటి అనారోగ్య సమస్యలు, ప్రమాదాలకు గురై చికిత్స కోసం వెళ్లిన రోగులు విగత జీవులుగా మారుతున్నారని బాధిత కుటుంబసభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రైవేటు దవాఖానల యాజమాన్యాలు ధనార్జనే ధ్యేయంగా మృతి చెందిన రోగులను వెంటిలేటర్లపై పెట్టి, లక్షల రూపాయల బిల్లులు దండుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని బాధిత కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. అయితే గురువారం జరిగిన అమ్మోర్ హాస్పిటల్ ఘటనపై మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వైద్యాధికారిని వివరణ కోరేందుకు యత్నించగా.. ఆయన స్పందించకపోవడం గమనార్హం.

ప్రమాద బాధితుడికి ఆర్యవైశ్యుల సాయం

ఆర్థికసాయం అందిస్తున్న ఆర్యవైశ్య నేతలు

జగద్గిరిగుట్ట, జూన్13 : ఆపన్నులకు సాయం అందించడం అభినందనీయమని మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు పార్శీ ప్రకాశ్‌గుప్త అన్నారు. ఆల్విన్‌కాలనీకి చెందిన భైరవనాథ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో కుటుంబసభ్యులు ఆర్యవైశ్య సంఘాన్ని ఆశ్రయించారు. వారి పిల్లల చదువు కోసం గురువారం జగద్గిరిగుట్ట కార్యాలయంలో రూ.20వేల ఆర్థికసాయం, ప్రైవేటు పాఠశాలలో చేరేందుకు రాయితీ ఇప్పించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి తేరాల శ్రీనివాస్, గోరయ్యగుప్త, రాజయ్యగుప్త, అంజన్ కుమార్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

బీఏఎస్‌ఎల్పీ రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 13: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఏఎస్‌ఎల్పీ పరీక్షా ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఓ ప్రకటనలో తెలిపారు. బీఏఎస్‌ఎల్పీ మొదటి, రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్, మూడు, ఐదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.500 చొప్పున చెల్లించి, ఈనెల 20వ తేదీలోగా టీఎస్‌ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో ఈనెల 22తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 22లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

బీఫార్మసీ పరీక్షా ఫలితాల విడుదల

ఓయూ పరిధిలోని బీఫార్మసీ పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. బీఫార్మసీ (పీసీఐ) సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను విడుదల చేశారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఓయూ పరిధిలోని హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల(బీహెచ్‌ఎంసీటీ, బీసీటీసీఏ) పరీక్షా తేదీలను ఖరారు చేశారు. ఈ కోర్సులు రెండు, ఆరో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, మొదటి, ఐదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈనెల 26 నుంచి నిర్వహించనున్నారు.

డీడీఎంఎస్‌లో వివిధ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ ఒకేషనల్ కోర్స్ సెంటర్‌లో పలు కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్‌కేర్ మల్టీపర్పస్ వర్కర్ (నర్సు కోర్స్), ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, డయాలసిస్ అసిస్టెంట్ తదితర కోర్సుల్లో సర్టిఫికెట్ కోర్సును అందించనున్నట్లు పేర్కొన్నారు. డయాలసిస్ అసిస్టెంట్ కోర్సుకు కనీస అర్హత ఇంటర్మీడియట్, మిగిలిన కోర్సులకు కనీస అర్హత పదో తరగతి అని, అన్ని వయసుల వారు ఈ కోర్సుల్లో చేరవచ్చన్నారు. ఈ కోర్సుల్లో చేరేందుకు వచ్చే నెల 5వ తేదీ ఆఖరు అని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 8309037134, 6305895867 నంబర్లలో సంప్రదించాలన్నారు.

18 నుంచి సెల్ట్ తరగతులు

ఓయూలోని సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ (సెల్ట్)లో ఈ నెల 18నుంచి తరగతులను నిర్వహించనున్నట్లు సెల్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సవిన్ సౌడ ఒక ప్రకటనలో తెలిపారు. 'ఎ సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్' పేరుతో ఆఫ్‌లైన్‌లో నిర్వహించే రెండు నెలల కోర్సుకు ప్రతి రోజూ ఉదయం ఆరున్నర గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5:30 నుంచి 7 గంటల వరకు వేర్వేరుగా ప్రత్యేక బ్యాచ్‌లను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 17లోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 9703589689, 7989903001నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బ్లాక్‌మార్కెట్‌కు రేషన్ బియ్యం

9 మందిని అరెస్ట్ చేసిన టాస్క్‌ఫోర్స్

సిటీబ్యూరో, జూన్ 13 (నమస్తే తెలంగాణ): రేషన్ బియ్యాన్ని నల్లబజార్‌కు తరలిస్తున్న ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసి, 46 క్వింటాళ్ల బియ్యం, 4 క్వింటాళ్ల గోధుమలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మీపెరుమాల్ కథనం ప్రకారం... లబ్ధిదారులు తీసుకునే సబ్సిడీ బియ్యాన్ని తక్కువ ధరకు కొందరు కొని వాటిని ఎక్కువ ధరకు నల్లబజార్‌కు తరలించే ముఠాలకు విక్రయిస్తునానరు. హుమాయిన్‌నగర్, చిలకలగూడ, ముషీరాబాద్, మలక్‌పేట్, యాఖత్‌పురా పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇలా జరుగుతుందని సమాచారం రావడంతో రైస్ బ్లాక్‌మార్కెట్‌కు తరలించే వారిపై నిఘా పెట్టి 9 మందిని అరెస్ట్ చేశారు. నిందితులు అత్తాపూర్‌కు చెందిన విశాల్ యాదవ్, ముషీరాబాద్‌కు చెందిన మహ్మద్ నజీర్, వారసిగూడకు చెందిన మహ్మద్ షోహెబ్, మహ్మద్ జంగీర్, ఎండీ షాహబాజ్, సరూర్‌నగర్‌కు చెందిన సంగం లోవ అలియాస్ రాజు, పటేల్‌నగర్‌కు చెందిన సయ్యద్ రహీమ్, అంబర్‌పేట్‌కు చెందిన సయ్యద్ నజీమ్, మహ్మద్ మజహర్‌లను అరెస్ట్ చేశారు. ఈ ముఠా నుంచి రూ. 2.5 లక్షల విలువైన బియ్యం, గోధుమలతో పాటు ఒక బైక్, లారీని స్వాధీనం చేసుకున్నారు.

మద్యం మత్తు.. మితిమీరిన వేగం

■ ఆటోను ఢీకొట్టి.. ఆపై అడ్డుగా వచ్చిన వ్యక్తి పైనుంచి తీసుకెళ్లిన కారు డ్రైవర్

■ ఒకరు మృతి.. మరొకరికి తీవ్రగాయాలు ■ ఇద్దరి అరెస్టు, మరో ఇద్దరు పరార్

■ నాంపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘటన

సుల్తాన్‌బజార్, జూన్ 13: మద్యం మత్తులో మితిమీరిన వేగంతో కారు నడిపి ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రగాయాలు పాలైన ఘటన నాంపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ ఘటనలో నాంపల్లి పోలీసులు ఇద్దరిని అరెస్టు చేయగా.. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. ఇన్‌స్పెక్టర్ అభిలాష్ తెలిపిన ప్రకారం..కూకట్‌పల్లి రామాయణ్ టెంపుల్ సమీపంలోని విష్ణుసాయి బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న గిద్దలూరుకు చెందిన చీమలదిన్నె రామాంజనేయులు(24) తోటి హాస్టల్ స్నేహితులు మధు, శ్రీకాంత్‌లతో కలిసి కారులో చార్మినార్ వద్ద పుట్టినరోజు జరుపుకుంటున్న స్నేహితుడైన రాజశేఖర్ వద్దకు వెళ్లారు. ముందుగానే కారులో ఉంచిన 8బీర్లను సేవించారు. తదనంతరం రాత్రి 12 గంటల సమయంలో చార్మినార్ వద్దకు చేరుకొని అక్కడ రాజశేఖర్ కేట్‌కట్ చేసి బర్త్‌డే వేడుకలు జరుపుకున్నారు. తర్వాత హాస్టల్‌కు వస్తుండగా మధ్యలో మద్యం సేవించిన కారు డ్రైవర్ మితిమీరిన వేగంతో నాంపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని ఓ ఆటోను ఢీకొనడంతో ఆటో పల్టీకొట్టింది. వెంటనే ఆ కారును ఆపేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించగా.. వేగంతో ఉన్న కారు ఆ వ్యక్తిని ఢీకొట్టి పైనుంచి వెళ్లింది. దీంతో ఆ వ్యక్తిని తోటి స్నేహితులు నిమ్స్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ నేరేడ్‌మెట్‌కు చెందిన అజయ్ మృతి చెందాడు. ఈ ఘటనలో హఫీజ్‌పేటకు చెందిన ఆటోడ్రైవర్ నర్సింగ్ రావు(55)తీవ్రగాయాలతో ఐసీయూలో చికిత్స పొందుతున్నాడని ఇన్‌స్పెక్టర్ వివరించారు.

కారును ఆపేందుకు యత్నించిన వ్యక్తి మృతి

ఆటోను ఢీకొట్టి వెళ్తున్న కారును ఆపేందుకు వెళ్లిన నేరేడ్‌మెట్‌కు చెందిన అజయ్ మృతి చెందడం కలచివేసింది. కాగా, అజయ్ తన తోటి స్నేహితులు పొన్నాడ సాయితేజ్, సమిల్లాఖాన్, జి.సుజిత్‌లతో కలిసి నాంపల్లి రైల్వేస్టేషన్ వద్ద హోటల్‌లో బిర్యాని తినేందుకు వచ్చారు. బిర్యాని తిన్న తర్వాత బయటికి రాగా.. ఆటో బోల్తా పడటం చూసి ఢీకొట్టిన కారును ఆపేందుకు యత్నించగా.. ఈ క్రమంలో కారు ఢీకొట్టి పైనుంచి వెళ్లడంతో నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనను ప్రత్యక్షంగా చూసిన అజయ్ స్నేహితులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ఘటనకు కారణమైన నలుగురిలో పోలీసులు ఇద్దరిని అరెస్టు చేయగా.. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని, వారి కోసం తీవ్రంగా గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పిల్లలతో సహా తల్లి ఆత్మహత్యాయత్నం

■ తల్లీబిడ్డను కాపాడిన పెట్రోలింగ్ పోలీసులు, కొడుకు మృతి

■ అమీన్‌పూర్ పెద్ద చెరువులో ఘటన.. భార్యాభర్తల గొడవలే కారణం

శ్రీహన్స్ మృతదేహం

మహిళను కాపాడిన పెట్రోలింగ్ పోలీసులు

అమీన్‌పూర్, జూన్ 13: భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతుండటంతో జీవితంపై విరక్తి చెందిన భార్య తన ఇద్దరు పిల్లలతో కలిసి చెరువులో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటనలో తల్లీకూతురు ప్రాణాలతో బయటపడగా.. మూడేండ్ల కొడుకు ప్రాణాలు కోల్పోయాడు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పెద్దచెరువులో ఈ ఘటన చోటుచేసుకున్నది. పటాన్‌చెరు సీఐ నాగరాజు తెలిపిన వివరా ప్రకారం.. చందానగర్‌కు చెందిన శ్వేత, విద్యాధర్‌రెడ్డి దంపతులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. వీరికి మూడేండ్ల వయసు కలిగిన కవలలు పాప శ్రీహ, బాబు శ్రీహన్స్ సంతానం. భార్యాభర్తలిద్దరి మధ్య గొడవ జరగడంతో తన ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి శ్వేత బుధవారం అర్ధరాత్రి స్కూటీపై అమీన్‌పూర్ పెద్దచెరువు వద్దకు వచ్చారు. తన పిల్లలతో కలిసి చెరువులో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పెట్రోలింగ్ చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ జానకిరామ్, కానిస్టేబుల్ ప్రభాకర్ గుర్తించి తల్లీకూతురిను కాపాడారు. చెరువులో మునిగిపోయిన బాబు శ్రీహన్స్ కోసం గాలించగా.. గురువారం ఉదయం మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పటాన్‌చెరు సీఐ నాగరాజు తెలిపారు.